# గురుశిష్యసంవాదము

శిష్యుడు

నమస్కారములు! ఏదో వ్రాయుచున్నారు!

గురువు

వ్రాయుట యిప్పుడే అయినది. శ్రీవివేకానందస్వామివారు ఆయన స్నేహితుఁడగు బాబూ ప్రమదమిత్రుఁడుగారికి ౩౦-౯-౧౮౯౮ తేదీని వ్రాసిన కడబటి యాంగ్లలేఖ యొకటి నీవంటి ప్రియశిష్యుఁడే యొకఁడు యెత్తి వ్రాసి యెన్నాళ్ళ క్రిందటనో నాకుఁ బంపినాఁడు.

శిష్యుడు

శ్రీ స్వామివారి ప్రసంగములు మూఁడో నాలుగో వెనుక మీకంపిన యాయనయేనా?

గురువు

ఔను!

శిష్యుడు

ఇదికూడ ఆంధ్రపరివర్తనార్థమే పంపినారా?

గురువు

"మీరు పరిశీలనదృష్టితోఁ జదువుటకు మాత్రమే"యని వ్రాసినాఁడుగాని, నేనది తెలిఁగించి యేపత్రికలోనో ప్రకటింపవలయునను నుద్దేశమే యతని కుండినట్లూహించినాను.

శిష్యుడు

ఆయన కీ లేఖ యెచట దొరికినది?

గురువు

'ప్రబుద్ధభారత' యను సుప్రసిద్ధాంగ్ల పత్రికలోఁ జూచినాఁడు.

శిష్యుడు

మహానుభావుఁడగు వివేకానందస్వామి వ్రాసినది లోకోపకారకముగా నుండకమానదని తలఁచెదను.

గురువు

నేను నట్లే యెంచుచున్నాను. కాని—

శిష్యుడు

"కాని"యని నీళ్లు నములుచున్నారేమి?

గురువు

బాబూ ప్రమదమిత్రుఁడుగారు శ్రీస్వామివారివలెనే యానాఁటి మహామేధావులలో నొకరఁట, స్వామితో పాటు ఆధ్యాత్మికకృషి చేసిన ప్రాణమిత్రుఁడఁట. ఉత్తరము తీరు చూచిన నుభయులకును అభిప్రాయభేదము విశేషముగా నున్నట్లు తోఁచుచున్నది.

శిష్యుడు

స్వామి తిట్టుచు వ్రాసినాఁడా యేమి?

గురువు

తిట్లు లేవుగాని తిట్లకంటెను తీవ్రముగా నుండు దెప్పుళ్లున్నవి. సన్న్యాసి యైనను స్వామివ్రాఁతలో రజోగుణప్రకోపమును, అభిమానాతిశయమును స్ఫుటముగాఁ గానిపించుచున్నవి.

శిష్యుడు

వివేకానందస్వామి యెప్పుడును పిడుగునోటివాఁడే!

గురువు

పిడుగుతోఁ బడు చల్లనివర్షము సస్యసమృద్ధి నిచ్చునట్లు ఆయన గాటుమాటలతో వెలువడు బోధామృతము చదువువారిని సత్వసంపన్నులుగను, దేశోపకర్తలుగను

జేయును. భోజనవిషయమునను బూర్వాచార్యుల విషయమునను మాత్రము అభిప్రాయభేదము లుండక మానవు.

శిష్యుడు

అలాగుననా? ఏదీ? దయచేసి యాలేఖ చదువుడు.

గురువు

ఇదిగో! వినుము!

ఆల్మోరా,
౩౦, మే, ౧౮౯౭.

ప్రియమిత్రమా,

తప్పించుకొన శక్యముగాని గృహసంబంధమైన విపత్తేదో నీకు దటస్థించినదని నే విన్నాను. జ్ఞానవంతుడవగు నిన్నాకష్టమేమి చేయగలదు? అయినప్పటికిని సాపేక్షకమగు ఐహికజీవనమునకు స్నేహసంసర్గసుఖము లానుషంగికములని తెలియుటచే, ఇందాక మాట నే నెత్తుకొనవలసివచ్చినది, కాని యట్టి దుఃఖసమయములు తఱచుగా మంచి యాధ్యాత్మికానుభవమును గలిగించుచుండును. తాత్కాలికముగా తమోమేఘములు తొలగిపోయి సత్యాదిత్యుని దివ్యతేజస్సు దృగ్గోచరమగును. కొందఱకు సంసారబంధము సగపాలు సడలిపోవును. అన్ని బంధములలోను దృఢతమమైనది ప్రతిష్ఠాబంధము. భార్యాశోకభీతి మరణభీతికంటెను బలవత్తరమైనది; అయినను అట్టి యవసరములందు దీపాశముకూడ గొంచెము వదులయిన ట్లగపడును. మనుష్యాభిప్రాయములు వినుటకంటె మనలో వసియించియుండు పరమేశ్వరుని మాట వినుట కడు శ్రేయస్కరమని మనసున కా క్షణమందు బోడ కట్టును. కాని మఱ్ఱంతలో మరల గ్రమ్ముకొనును— మాయ యనగా నిదియే!

చిరకాలమునుండి నేను నీకు సాక్షాత్తుగా ఉత్తరములు వ్రాయుట లేకపోయినను, నిన్ను గుఱించిన వార్తలన్నియు నితరులనుండి నాకు దెలియుచునే యున్నవి. కొంతకాలముక్రిందట భగవద్గీతానువాదపు ప్రతియొకటి దయతో నీవు నా కింగ్లండునకు బంపితివి. గ్రంథోపరితలమున నీవువ్రాసిన యొక పంక్తియే కలదు. ఆ పుస్తక మందినట్లు నేను మూడు ముక్కలలో బ్రత్యుత్తరమువ్రాసి నీ కంపితిని; అందుచే నీపై నా కుండిన పూర్వానురాగ మిపుడున్నదో లేదోయను సందేహము నీకు గలిగినట్లు నాకు దెలిసినది.

ఆ యనుమానమున కాధారములేదు. కాని నాసంక్షిప్తలేఖమునకు మాత్రము సరియైన కారణములున్నవి:—

నాలుగైదేండ్లకు, ఆంగ్లపరివర్తనమందిన గీతాగ్రంథము దెక్కనైపైని నీ చేతితో వ్రాసిన ఆయొక్క పంక్తి మాత్రమే చూచు అదృష్టము నాకు బట్టినది. అంతకంటె నధికముగా వ్రాయుటకు నీ కవకాశము లేనప్పుడు, ఎక్కువగా వ్రాసిన యుత్తరము చదువుకొనుటకుమాత్రము నీకు దీఱికయుండునా! యను సంశయము నాకు దోచినది. ఇది ప్రథమకారణము.

హిందూమతప్రచారకులగు తెల్లతోలువారితో నీకు మిక్కిలి స్నేహము కుదిరినదనియు, నింటరులగు మన దేశపు నల్లవాండ్రన్న నీ కసహ్యమనియు నాకు దెలియవచ్చినది. ఏతద్విషయకమైన భయము రెండవకారణము.

ఇక మూడవకారణ మేమనగా, నేను మ్లేచ్ఛశూద్రాదులలో జేరినవాడను, ఆహారనియమము లేకయున్నియు దినువాడను, నీరు నా రసిక అందఱిలోగలిసి యీదేశములోను, పై దేశములలోను బహిరంగముగా భుజించువాడను. అదియుగాక నా యభిప్రాయములుమాత్ర మహావికృతములైనవి. నిర్గుణమును కేవలమును అగు బ్రహ్మపదార్థము నాకగపడి, యొక్క పనుచున్నది—అని చెప్పగలను; కొందఱు పురుషులలో ఆ మహాతత్త్వముయొక్క ఆవిష్కరణము అసాధారణముగా నాకు జూపట్టుచున్నది; అట్టి యవతారమూర్తులు భగవంతులని చెప్పినచో నా కదియును గ్రాహ్యమగుచున్నది. అంతేకాని కేవల బుద్ధిచే గల్పింపబడి స్వీకరింపబడుచున్న జగత్కర్త్రాదులపైకి నా మనసు ప్రసరింపదు.

నా జీవితములో అట్టి భగవదవతారపురుషుని జూచినాను, ఆయన యాదేశముల ననుసరించి ప్రవర్తించుటకే నేను బ్రతికియున్నాను. స్మృతికర్తలును

పురాణకర్తలును కించిద్జ్ఞులు, అవి భ్రమప్రమాదజన్యములును, జాతిద్వేషప్రేరితములును అగు వాక్యములతో నిండియున్నవి. విశాలహృదయమును ఔదార్యానురాగములను జూపు సందలి కొన్నిభాగములు మాత్రమే స్వీకరణార్హములై యున్నవి, తక్కినవి త్యాజ్యములు. ఉపనిషత్తులును గీతయునే యథార్థములైన ఆమ్నాయములు. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, చైతన్యుడు, నానక్కు, కబీరు మున్నగువారు నిజమైన అవతారపురుషులు. ఎందుచేత? వారి హృదయములు ఆకాశమంత విశాలములైనవి గనుక, అందు ముఖ్యుడు రామకృష్ణుడు. శంకరరామానుజాదులు సంకుచితహృదయులైన కేవలపండితులుగా గనబడినారు. ఆ ప్రేమ యేది? ఇతరుల దుఃఖముచూచి పరితపించి కలకల యేడ్చు ఆ మృదులహృదయమేది? పట్టిచదువు! శుష్కపాండిత్యము! తన మోక్షమునైయే తహతహ! మితిలేని తొందర! కాని అయ్యో! అది సాధ్యమగునా? ఎప్పుడైనను బూర్వ మట్టి ముక్తి సిద్ధించినదా? ముందెన్నడైన సిద్ధింపగలదా? అణుమాత్రపు టహంభావశేషమైనను లోన నున్నంతకాలము అట్టిముక్తి లభించునా?

మఱి యొక వైపరీత్యము! వర్ణరూపపృథగ్భావము సంఘమును జీల్చి పాడుచేయు మహానర్థకరమైన భావమును మాయామూలమును—అను విశ్వాసము నానాటికి పెరిగి నా మనసులో దృఢముగా నాటుకొనుచున్నది, పుట్టుకనుబట్టి కాని యోగ్యతను బట్టి కానిచ్చు జాతిభేదమంతయు బంధకారణమే. "అదంతయు సత్యమే, ఆభావము లోపల నుంచుకొనవచ్చును గాని, పరస్పరసంబంధముగల బాహ్యప్రపంచమునమాత్రము జాతిభేదములవంటి భేదములు పాటింపకతప్పదు. అవి యత్యావశ్యకములు" అని కొందఱు మిత్రులు హితోపదేశము చేయుదురు. ప్రత్యాత్మైకభావరూపమైన పిఱికి పేడితనముతో గూడిన యేకత్వభావము లోపల! పైని పరపీడారూపమైన నరకలోకపిశాచతాండవము! పరమదరిద్రులగు చండాలాదులకు మరణబాధ కలిగించుచు, ధనవంతుడైన మాలవానిని మాత్రము "శ్రీ హరీ! ఈయన మతపోషకుడు." అనిపొగడుట!

మఱియొకమాట, గ్రంథములు చదివిచూడగా మతసంబంధమైన శిక్షణాభ్యాసములు శూద్రునకు గానట్టు నాకు జూపట్టుచున్నవి; ఆహారమునుగూర్చి కాని విదేశయాత్రనుగూర్చికాని యతడు తనబుద్ధి నుపయోగించి వివేచించుకొను నెడల, నది యతనికి నిష్ప్రయోజనమగును, పడిన శ్రమ యంతయు వృథాశ్రమయగును. నేను శూద్రుడను, మ్లేచ్ఛుడను, ఆ బాధలన్నిటితోను నా కేప్రశక్తియులేదు నాకు మాలకూడైననేమి? మ్లేచ్ఛభోజనమైన నేమి? జాతిసంబంధమైన పిచ్చిమాటలన్నియు బురోహితులు రచించిన పుస్తకములలో నున్నవి గాని పరమేశ్వరప్రకటితములైన పుస్తకములలో లేవు. తమపూర్వులు గావించిన మహాకార్యముల ఫలములను పురోహితులనే యనుభవింపనీ! నేనుమాత్రము ఎందు నా శ్రేయస్సంతయునున్నదో యా భగవద్వాక్యము ననుసరించియే పోయెదను.

"పరోపకారమే పరమార్థము, తక్కిన నిత్యనైమిత్తిక బాహ్యకర్మాదులన్నియు పిచ్చిచేష్టలు, కేవలస్వమోక్షసుఖాపేక్షకూడ దప్పే!" అను నిందొక సత్యము నాకనుభవగోచరమైనది. సర్వమును ఇతరులకై త్యజించువానిదే మోక్షము. ఇక "నాకుముక్తి! నాకుముక్తి!" యని యహోరాత్రములు తల బగులగొట్టుకొను తక్కినవారు తమ ప్రస్తుతక్షేమమునకును భావిశ్రేయస్సునకును గూడ భంగము గావించుకొని తిరుగులాడుచుందురు—ఇది స్వయముగా నేను పెక్కుపట్ల ననేకపర్యాయములు చూచినాను. ఈ సంగతులన్నియు నాలోచించుకొనగా నీకు జాబువ్రాయుటకు నాకు ధైర్యముచాలినదిగాదు. ఇన్ని విప్రతిపత్తులున్నప్పటికిని, నాయెడలంగల నీమైత్రి చెడిపోకుండ నెప్పటియట్లే యున్నట్లు నీకగపడుచో, నిజముగా అది నాకు మహానందకరమైన పర్యవసానమని నే భావించెదను.

భవదీయుడు,

వివేకానందుడు.

కూ—— చి న వ శిం హం